సాక్షి ఏలూరు

బుధవారం । 2 । ఏప్రిల్ । 2025



బంధువునని నమ్మించి దోపిడీ

భీమవరం: దూరపు బంధువునని నమ్మించాడు. దాడి చేసి బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు. ఆనక పోలీసులకు చిక్కి జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. 8లో ▸



పింఛన్.. ప్రతి నెలా టెన్షన్

కూటమి ప్రభుత్వం ఇంటికే పింఛన్ అందిస్తున్నామని చెబుతున్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో పింఛన్ లబ్ధిదారులకు అగచాట్లు తప్పడం లేదు. 8లో ▸



మామిడి పండుగ.. సందడిగా!

బుట్టాయిగూడెం: మన్యం కొండల్లో మామిడి కాయ పండుగ సందడి నెలకొంది. కొండరెడ్డి గిరిజన గ్రామాల్లో పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. 8లో ▸

నిరుద్యోగులను నిండా ముంచారు

- నిరుద్యోగ భృతి ఊసే లేదు
- మెగా డీఎస్సీ దగా డీఎస్సీనే..
- ఆప్కాస్ రద్దు యోచనపై అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆందోళన



మెగా డీఎస్సీ నిర్వహించాలని కోరుతూ ఏలూరులో ధర్నా (ఫైల్)

ఏలూరు (టూటౌన్): ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం.. తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడంపై నిరుద్యోగ యువత, డీఎస్సీ అభ్యర్థులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇంతవరకూ నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అధికారంలోకి రాగానే డీఎస్సీ ప్రకటన చేస్తామని చెప్పి.. 10 నెలలైనా ఉలుకూ పలుకూ లేదు. దీంతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారికి నిరాశే మిగిలింది. ఇక గత ప్రభుత్వం అమలు చేసిన ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసే యోచనపై కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ మండిపడుతున్నారు.

జిల్లాలో 1.50 లక్షలకు పైగా నిరుద్యోగులు

నిరుద్యోగ యువతకు ప్రతీ నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు దాని గురించి మాట్లాడడం లేదు. కూటమి ప్రభుత్వం తమను నమ్మించి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని డప్పాలు కొట్టిన నాయకులు ప్రస్తుతం దాని ఊసే ఎత్తక పోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు జిల్లాలో 16.50 లక్షల మంది వరకు జనాభా ఉన్నారు. వీరిలో 8 నుంచి 10 శాతం నిరుద్యోగ యువత ఉన్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే 1.50 లక్షల మందికి పైగా నిరుద్యోగులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వం తమకు ఉద్యోగాలు కల్పిస్తుందనే ఆశలో ఉన్నారు. లేని పక్షంలో ప్రతీ నెలా నిరుద్యోగ భృతి రూ.3 వేలు చొప్పున అందిస్తుందని ఓటు వేశారు. దీనిపై కూటమి ప్రభుత్వం ఇంత వరకూ ఎలాంటి ప్రకనట చేయలేదు. అధికారం చేపట్టి 10 నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్‌లో భాగంగా హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలును కొండెక్కించడం పట్ల నిరుద్యోగుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. అవకాశం వస్తే తమ సత్తా చూపేందుకు సన్నద్ధమవుతున్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ఆవేదన

అధికారం చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యయ ఖాళీలను భర్తీ చేస్తామంటూ ప్రకటనలు గుప్పించారు. ఈ క్రమంలో అధికారంలోకి రాగానే డీఎస్సీ అభ్యర్థుల కంటి నీరు తుడిచేలా డీఎస్సీ ప్రకటన చేశారు. 10 నెలలు కావస్తున్నా దీనిపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పాలకులు మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులైన తమను మోసం చేసారని డీఎస్సీ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకోవడం తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆగ్రహం

గత ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఆప్కాస్ విధానం రద్దు చేసే యోచనలో కూటమి ప్రభుత్వం ఉండటం పట్ల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్ట్ ఏజెన్సీలు, సంస్థలు, వ్యక్తులు లేకుండా ఆప్కాస్ ద్వారా నేరుగా ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించడం, పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాలలో తమ వాటాను జమ చేయడం వంటి వాటి వల్ల సుమారు 10 వేల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరింది. ఆప్కాస్ రద్దు చేసి మళ్లీ పాత విధానాన్ని ప్రవేశపెడితే తమకు కష్టాలు తప్పవని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాబ్ క్యాలెండర్ హామీ ఏమైంది ?



ఏటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఖాళీలను భర్తీ చేస్తామని, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామంటూ ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇవ్వాలి. తొలగించిన వలంటీర్లను విధుల్లోకి తీసుకుని వారికి నెలకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలి.

– జి.సూర్యకిరణ్, జిల్లా కార్యదర్శి, డీవైఎఫ్ఐ

సూపర్ సిక్స్ అమలులో విఫలం



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైంది. ఇంట్లో చదువుకునే ప్రతి పిల్లవాడికి ఏడాదికి రూ.15 వేల చొప్పున తల్లికి వందనం పేరుతో వేస్తామని ఇచ్చిన హామీ ఏమైంది. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడటం తగదు. తక్షణం మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలి.

– కే.లెనిన్, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ, ఏలూరు జిల్లా

ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు తెరవాలి

ఏలూరు (టూటౌన్): ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని రైతుల సమస్యలను చర్చించి తీర్మానాలు ఆమోదించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రబీ ధాన్యం మాసూళ్లు ప్రారంభమయ్యాయని, మొక్కజొన్న పంట కల్లాల్లో ఉందని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని కోరారు. రైతులకు గోనె సంచులు ఇచ్చి కొనుగోలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతు సేవా కేంద్రంలో నిర్ణయించిన తేమ శాతం, తూకం ఆధారంగానే మిల్లులు వద్ద ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. తగినన్ని గోనె సంచులు, రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. హమాలీ చార్జీలు రైతులకే చెల్లించాలని కోరారు. మొక్కజొన్న మద్దతు ధర కంటే తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేయడం వల్ల మొక్కజొన్న రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రైతులను ఆదుకునేందుకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణలో మూడో ఆయిల్ ఫెడ్ కర్మాగారానికి శంకుస్థాపన చేసినా రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం చలనం లేకపోవడం బాధాకరమన్నారు. పెదవేగి లోని ఏకైక ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రైవేటీకరించాలని ప్రయత్నాలు చేయడం అన్యాయమన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు కోన శ్రీనివాసరావు, గుండపనేని సురేష్, వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఇంటర్ పుస్తకాల పంపిణీ



ఇంటర్ విద్యార్థుల కోసం పుస్తకాలు వాహనాల్లో లోడ్ చేస్తున్న కార్మికులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలను జిల్లాలోని వివిధ కళాశాలలకు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఆయా కళాశాలలకు వివిధ వాహనాల్లో ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ ఏడాది ప్రస్తుతం అన్ని ప్రభుత్వ యాజమాన్యాల్లోని పాఠశాలలకు 67,800 నోటు పుస్తకాలు వచ్చాయని బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.యోహాను తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు 5751 టెక్స్ట్ పుస్తకాలు వచ్చాయని, వాటిని కూడా ఆయా కళాశాలలకు తరలించామని తెలిపారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు మొత్తం 22,413 మంది హాజరయ్యారు. 22,704 మంది రెగ్యులర్ విద్యార్థులకు 22,244 మంది హాజరు కాగా ఒకసారి అనుత్తీర్ణులైన వారిలో 295 మంది విద్యార్థులకు 169 మంది హాజరయ్యారు. పరీక్షలను జిల్లా పరిశీలకుడు 4 కేంద్రాల్లో, జిల్లా విద్యాశాఖాధికారి 4 కేంద్రాల్లో, ప్రభుత్వ పరీక్షల సహాయ కమీషనర్ 3 కేంద్రాల్లో, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 29 కేంద్రాల్లో తనిఖీ చేశారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

కూల్‌డ్రింక్స్ డిస్ట్రిబ్యూషన్ డిపోలో తనిఖీలు



తనిఖీల సందర్భంగా రికార్డులు పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామరాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని కూల్ డ్రింక్స్ డిస్ట్రిబ్యూషన్ డిపోలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. గడువు దాటిన కూల్‌డ్రింకులు దుకాణాలకు పంపిణీ చేస్తున్నారని అందిన ఫిర్యాదుల మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామరాజు స్థానిక నరసింహరావు పేటలోని జిమ్ ఎంటర్‌ప్రైజెస్ కోకాకోలా సేల్స్ డిపోలో ఫిర్యాదుదారుల సమక్షంలో తనిఖీలు నిర్వహించారు. అధికారులకు గడువు తేదీ ముగిసిన డ్రింకులు ఏమీ లభ్యం కాలేదు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ కల్తీ విషయంలో ఎలాంటి ఫిర్యాదులందినా వెంటనే తనిఖీలు చేస్తామని, కల్తీ జరిగినట్టు గుర్తిస్తే సంబంధిత పదార్థాల సాంపిళ్ళు ల్యాబ్‌లకు పంపి పరీక్షిస్తామన్నారు. కల్తీ జరిగిటన్లు తేలితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గురుకుల పాఠశాలల్లో చేరికకు 25న ప్రవేశ పరీక్ష

టి.నరసాపురం: జిల్లాలోని గురుకుల పాఠశాలలు అప్పలరాజుగూడెం(బాలురు), నాగిరెడ్డిగూడెం (బాలికలు), ముసునూరు (బాలికలు)లో 5, 6, 7, 8 తరగతులలో, ఇతర ప్రాంతాల్లో ఉన్న గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అప్పలగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డీఎస్‌బీ శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవా కేంద్రం ద్వారా వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25న జరుగుతుందన్నారు. వివరాలకు 87126 25030 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని దూబచర్ల డైట్ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను ఎఫ్‌ఎస్‌టీసీ విధానంలో భర్తీ చేసే నిమిత్తం అర్హత, ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న అన్ని యాజమాన్యాల్లోని(ప్రభుత్వ/ జిల్లా పరిషత్/ మున్సిపల్) పాఠశాలల్లో పని చేస్తున్న మండల విద్యాశాఖాధికారులు/ ప్రధానోపాధ్యాయులు/ స్కూల్ అసిస్టెంట్లు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలు డీఈఓ ఏలూరు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

పింఛన్లపై అన్నీ కోతలే

- ఎన్నికల హామీలన్నీ గాలి మాటలే..
- 9 నెలల కాలంలో వేలల్లో తొలగింపు
- కొత్తవి ఒక్కటీ మంజూరు చేయని కూటమి సర్కారు



ఏలూరు(మెట్రో): మేం అధికారంలోకి వస్తే 45 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీలకు పెన్షన్లు ఇస్తాం. బీసీల్లో 50 ఏళ్లు పైబడిన వారికి పెన్షన్ అందిస్తాం. ఒక్క పెన్షన్ కూడా తొలగించకుండా అర్హులైన వారికి కొత్త పెన్షన్‌లు మంజూరు చేస్తాం. ఇది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకూ చెప్పిన మాటలు. ప్రజలకు ఇచ్చిన అబద్ధపు వాగ్దానాలు. గద్దెనెక్కాక పెన్షన్‌దారులకు చుక్కలు చూపిస్తున్న కూటమి సర్కారు అడ్డగోలుగా పెన్షన్‌లు తొలగిస్తూ, దివ్యాంగులు, వృద్ధులను ఇబ్బంది పెడుతోంది. మరణాల వల్ల పెన్షన్లు తగ్గుతున్నాయని చెబుతూ తొలగింపు వ్యవహారాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో పండుగే..

గతంలో నెలలో ఒకటో తేదీ వచ్చిందంటే వృద్ధులు, వికలాంగులు , వితంతువులకు పండుగ వాతావరణం ఉండేది. వేకువజామునే పింఛన్‌దారుల తలుపు తట్టి ఇంటి వద్దే పెన్షన్ అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ సర్కారు చర్యలు తీసుకుంది. గతంలో బాధలు పునరావృతం కాకుండా కమ్యూనిటీ హాళ్ల వద్ద పండుటాకులు పడిగాపులు పడకుండా.. ఇంటి వద్దకే పెన్షన్ పంపిణీ ప్రక్రియ చేపట్టింది. గత ఎన్నికల్లో పింఛన్లు పెంచుతాం, అర్హతలు, నిబంధనల్లో వెసులుబాటు కల్పిస్తానంటూ ప్రగల్భాలు పలికిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ఉన్న పెన్షన్‌లు సైతం తొలగించేందుకు చర్యలు చేపట్టారు. కూటమి సర్కారు గద్దెనెక్కిన నాటి నుంచి ప్రతీ నెలా పెన్షన్‌లు తొలగిస్తూ వస్తున్నారు. తొలగించిన పెన్షన్‌లన్నీ మరణించిన వారివే అని అధికారులతో ప్రకటనలు చేయిస్తున్నారు.

కొత్త పెన్షన్లు ఎక్కడ?

వాస్తవానికి పింఛన్‌లు అర కొర తగ్గించినా, కొత్త పింఛన్‌లు వచ్చి చేరుతూనే ఉంటాయి. ప్రతీ సంవత్సరం నూతన పింఛన్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి సంవత్సరంలో రెండుసార్లు నూతన పెన్షన్‌లను ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. అయినప్పటికీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా ఒక్క పెన్షన్‌ను కొత్తగా మంజూరు చేయలేదు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఎస్సీ, ఎస్టీలకు 45 సంవత్సరాలకే పెన్షన్ అందిస్తానని, అదే విధంగా బీసీలకు 50 ఏళ్లు పైబడితే పెన్షన్ ఇస్తామని ప్రకటించారు. వీటిపై నేటికీ కూటమి నాయకులు నోరు మెదపలేదు. మరణాల వల్ల పింఛన్ల సంఖ్య తగ్గిందని చెబుతున్నా, మరణించిన వారి స్థానంలో కొత్త పింఛన్‌లు మంజూరు చేసిన పాపాన పోలేదు.

కోకో రైతులను ఆదుకోకపోతే ఉద్యమమే



కోకో రైతుల కమిటీ సమావేశంలో ఐక్యతను చాటుతున్న ప్రతినిధులు

ఏలూరు (టూటౌన్): కోకో గింజలు కొనుగోలు, ధర సమస్యలు వెంటనే పరిష్కరించి కోకో రైతులను ఆదుకోకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని, రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే చలో గుంటూరు ఉద్యాన శాఖ కమిషనర్ కార్యాలయం కార్యక్రమం చేపడతామని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం హెచ్చరించింది. ఏలూరు అన్నే భవనంలో కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సమావేశంలో కోకో రైతుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెల రోజులుగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా, రాష్ట్ర ఉద్యాన శాఖ అధికారుల సమక్షంలో కంపెనీలతో చర్చలు జరిపినా కొనుగోలు, ధర సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర ఇస్తామని కంపెనీలు అంగీకరించాయని ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు చెప్పినా ఆచరణలో అమలు కావడం లేదని విమర్శించారు. రోజురోజుకీ ధర తగ్గించి వేస్తున్నాయని, కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడుకు ప్రతినిధి బృందం మార్చి 29న వినతి పత్రం అందజేయగా రెండు, మూడు రోజుల్లో కంపెనీలతో మీటింగ్ జరిపి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ప్రస్తుతం కిలోకు రూ.700కు పైగా ధర ఉందని ప్రస్తుతం కంపెనీలు రూ.500 నుంచి రూ.550కు ధర ఇస్తున్నాయని, ఈ ధర మరింత తగ్గిస్తామని రైతులను బెదిరించడం దుర్మార్గమని విమర్శించారు. న్యాయం జరిగే వరకూ కోకో రైతులు ఐక్యంగా పోరాడతారని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ళ సుబ్బారావు, పానుగంటి అచ్యుతరామయ్య, ఉప్పల కాశీ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, గుదిబండి వీరారెడ్డి, కొసరాజు రాధాకృష్ణ, రాష్ట్ర కోశాధికారి జాస్తి కాశీ బాబు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ కేడెట్‌గా బి.షణ్ముఖ్ ఎంపిక



బెస్ట్ కేడెట్‌గా ఎంపికైన షణ్ముఖ్ సత్యను అభినందిస్తున్న కమాండ్ అధికారి అమిత్ పాండే

భీమడోలు: భీమడోలు శ్రీవేంకటేశ్వర కళాశాల బీఎస్సీ డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థి బి.షణ్ముఖ్ సత్య ఉత్తమ కేడెట్‌గా ఎంపికయ్యాడు. 2024–25 సంవత్సరానికి ఏలూరు ఎన్‌సీసీ యూనిట్ సీనియర్ డివిజన్ విభాగంలో షణ్ముఖ్ సత్య పలు విభాగాల్లో ప్రతిభను కనుబర్చాడు. ఏలూరులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ కమాండ్ అధికారి, కల్నల్ అమిత్ పాండే చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. తమ కళాశాల విద్యార్థి ఎంపిక కావడం గర్వంగా ఉందని ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ పేర్కొన్నారు.

ఆప్కాస్ రద్దును విరమించుకోవాలి



ఏలూరు కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఏలూరు(టూటౌన్): ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలను ఉపసంహరించుకోవాలని, మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్–ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు ఎంతో కొంత ఉపశమనంగా ఉన్న ఆప్కాస్‌ను రద్దుచేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు కట్టబెట్టడం అంటే వెట్టిచాకిరిలోకి, బానిసత్వంలోకి నెట్టి వేయడమేనని విమర్శించారు. ప్రైవేటు ఏజెన్సీలకు ఇస్తే పిఎఫ్, ఈఎస్ఐలకు, కనీస వేతనాలకు గ్యారెంటీ ఉండదని ఆందోళన వ్యక్తి చేశారు. గత ప్రభుత్వం 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం అన్యాయం అన్నారు. ఎక్స్‌గ్రేషియా పెంచడం, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచడం, ఇంజనీరింగ్ కార్మికులకు 36 నెంబర్ జీవో ప్రకారం జీతాలు, దహన సంస్కారాల ఖర్చులు రూ.20 వేలకు పెంచడం వంటి డిమాండ్లు నెరవేర్చాలన్నారు. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక ఆందోళన చేపట్టడానికి మున్సిపల్ కార్మికులు సన్నద్ధంగా ఉన్నారన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య, లావేటి కృష్ణారావు, అంగుశూరు జానుబాబు, బంగారు వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీల్లో ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో సెషన్ –2 జేఈఈ మెయిన్స్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు నగరంలోని సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలను ఎంపిక చేశారు. పరీక్షలు ఈ నెల 2, 3, 4, 7, 8, 9 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరుగుతాయి. ప్రతి పూట సుమారు 160 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారు. 2, 3, 4, 7 తేదీల్లో ఇంజనీరింగ్ కోర్సులకు 8, 9 తేదీల్లో బీ ఆర్క్, బీ ప్లానింగ్ కోర్సులకు ప్రవేశ పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు (దరఖాస్తులో అప్‌లోడ్ చేసినవి ఉంటే మేలు), ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలి. అరగంట ముందుగానే పరీక్ష గదిలోకి వెళ్ళాలి.

హమ్మయ్య ! పరీక్షలైపోయాయి..



పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగియడంతో ఏలూరు సెయింట్ థెరిస్సాలో పరీక్షలు రాసి ఉత్సాహంగా బయటకు వస్తున్న విద్యార్థులు. – ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)

పాస్టర్ ప్రవీణ్ పగడాలపై అసత్య ప్రచారం

తణుకులో క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీ



తణుకులో క్రైస్తవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

తణుకు అర్బన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలంటూ క్రైస్తవ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం తణుకులో శాంతి ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ రాష్ట్రపతి రోడ్డు మీదుగా నరేంద్ర సెంటర్‌కు చేరుకుని ప్రవీణ్ పగడాలకు నివాళులర్పించారు. క్రిస్టియన్ కౌన్సిల్ నాయకుడు ఒ.మనోజ్‌బాబ్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతికి క్రైస్తవ లోకం బాధపడుతుంటే మద్యం కొనుగోలు చేశారని, మద్యం సేవించి ప్రయాణించారని సామాజిక మాధ్యమాల్లో చూపిస్తూ తప్పుడు సంకేతాలు పంపిస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా టీవీ 5 మూర్తి క్రైస్తవ లోకాన్ని హేళన చేసేలా దశమ భాగాలు తీసుకునే పాస్టర్లు, పనిమనుషుల నుంచి డబ్బులు తీసుకునే పాస్టర్లు అని సంబోధిస్తూ వ్యంగంగా మాట్లాడడాన్ని క్రైస్తవ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయని తక్షణమే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైజాగ్‌లో డ్రగ్స్ దొరికినప్పుడు ఎలాంటి ఆధారాలు లేకుండానే నిందలు వేశారని, తిరుపతి లడ్డూలో పశువుల కొవ్వు ఉందని ఎటువంటి ఆధారాలు లేకుండానే నిందలు వేసి సున్నితమైన అంశాలను వివాదాస్పదం చేస్తుంది ఎవరని నిలదీశారు. ప్రవీణ్ మృతి ఘటనను సీబీఐతో దర్యాప్తు చేయించాలన్నారు. ర్యాలీలో పాస్టర్లు ఎం.హారత్‌బాబు, పీడీ ప్రసన్నకుమార్, ఎన్.ఇశ్రాయేలు, కె.దానియేలు, యు.రాజ్‌కుమార్, బి.జేమ్స్, కె.బ్లెస్సింగ్ రాజు, భారీ సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి రిమాండ్

కుక్కునూరు: లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి కోర్టు రిమాండ్ విధించినట్లు సీఐ ఎం.రమేష్ బాబు మంగళవారం తెలిపారు. కుక్కునూరు పీహెచ్‌సీలో ఫార్మసిస్టుగా విధులు నిర్వహిస్తున్న కొమరం ముత్యాలమ్మపై గొడ్ల అజిత్‌కుమార్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు అజిత్‌కుమార్‌ను మంగళవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

కూటమి నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలి



కైకలూరు సీఐ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళిత నేతలు

కైకలూరు: విధి నిర్వహణలో భాగంగా ఫొటోలు తీస్తున్న భవ్య న్యూస్ ఎడిటర్ కురేళ్ళ కిషోర్‌పై దాడి చేసిన కూటమి నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని పలు దళిత సంఘాలు మంగళవారం డిమాండ్ చేశాయి. ప్రముఖ దళిత నాయకుడు మత్తె సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో తాలూకా సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడ నుంచి ర్యాలీగా సీఐ కార్యాలయానికి వెళ్లారు. దాడి ఘటనపై తక్షణ కేసు నమోదు చేయాలని రూరల్ సీఐ వి.రవికుమార్‌ను కోరారు. అనంతరం విలేకరులతో సూర్యచంద్రరావు మాట్లాడుతూ మార్చి 26న భుజబలపట్నంలో వైస్ ఎంపీపీ ఎన్నిక విషయంలో జరిగిన ఘర్షణ ఫొటోలను తీస్తున్న పాత్రికేయుడు కురేళ్ళ కిషోర్‌పై కూటమి నేతలు దాడి చేయడం అమానుషమన్నారు. దాడి చేసిన వారిని ఆయా పార్టీలు సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత ప్రజా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు మత్తె రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారత్నం, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ మద్దా ప్రేమ్‌కుమార్, దళిత నాయకులు పాతపాటి శాంతరాజు, గాలి ప్రసాద్, బోడిగంటి కిషోర్, బండి ప్రసాద్, సోమల శ్యామ్‌సుందర్, రత్నరాజు, దాసరి ప్రసాద్, రాజు, గోపవరం దళిత యువత హాజరయ్యారు.

వ్యక్తిపై హత్యాయత్నం

ఉంగుటూరు: వ్యక్తిపై హత్యాయత్నం జరిగిన ఘటన మంగళవారం రాత్రి ఉంగుటూరులో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం ఉంగుటూరు దళిత పేటకుచెందిన యర్రారపు రాజు భార్యతో అదేపేటకు చెందిన మార్లపూడి ప్రసాదు వివాహేతర సంబంధం కలిగి ఉండటంపై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రెండుసార్లు పెద్దల సమక్షంలో పెట్టగా గొడవను సద్దుమణిగేలా చేశారు. కాగా మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో బైక్‌పై నారాయణపురం వైపు వెళుతున్న ప్రసాద్‌పై రాజు గొడ్డలితో దాడి చేశాడు. మెడపై తీవ్ర గాయమైన ప్రసాద్‌ను తాడేపల్లిగూడెం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

5న వీఆర్ఏల రాష్ట్ర సదస్సు

భీమవరం: విజయవాడ ఎంబీ భవన్‌లో ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల రాష్ట్ర సదస్సుకు అన్ని మండలాల నుంచి వీఆర్ఏలు హాజరై జయప్రదం చేయాలని వీఆర్ఏల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎం.ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వీఆర్ఏలు విడిపోయారనే పేరుతో ప్రభుత్వం దోబూచులాడుతుందని, అందరూ కలిసి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. బడ్జెట్ లేదనే పేరుతో జీతాల బిల్లు పెట్టకపోవడం దారుణమన్నారు.

పింఛన్.. ప్రతినెలా టెన్షన్



పింఛన్ కోసం చొడిదిబ్బ సచివాలయానికి వచ్చి దీనంగా తిరిగి వెళ్తున్న వృద్ధురాలు

వైఎస్ జగన్ పాలనలో వలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీన ఠంచనుగా తలుపు తట్టి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్ డబ్బులు ఇచ్చి వెళ్లేవారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాము కూడా ఇంటికే పింఛన్ అందిస్తున్నామని చెబుతున్నా ఆ దిశగా సరైన చర్యలు తీసుకోకపోవడంతో పింఛన్ లబ్ధిదారులకు అగచాట్లు తప్పడం లేదు. దీంతో వృద్ధులు, వికలాంగులు పింఛన్ సొమ్ముల కోసం సచివాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. కొన్ని సచివాలయాలు తాళాలు వేసి ఉండడం, కొన్నిచోట్ల సచివాలయాల్లో సిబ్బంది ఉండకపోవడంతో వృద్ధులు, వికలాంగులు పింఛన్ డబ్బుల కోసం పడిగాపులు పడాల్సిన దుస్థితి తలెత్తింది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



చేపల తూము సెంటర్ సచివాలయం వద్ద పింఛన్ కోసం ఎదురుచూపులు



మండుటెండలో లంకపేట సచివాలయానికి వచ్చిన వృద్ధురాలు



పింఛన్ అందలేదని రాణినగర్ సచివాలయానికి వచ్చిన వృద్ధులు





తాళం వేసి ఉన్న కోరాడ నాగన్న వీధిలోని సచివాలయం, కొత్తపేట సచివాలయంలో పింఛన్ తీసుకున్న విభిన్న ప్రతిభావంతురాలు

మామిడి పండుగ.. ఉత్సాహంగా..



అలివేరులో వనదేవతకు పూజలు చేస్తున్న దృశ్యం



డోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తున్న కొండరెడ్డి గిరిజనులు

బుట్టాయగూడెం: మన్యం కొండల్లో మామిడికాయ పండుగ సందడి నెలకొంది. పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని కొండరెడ్డి గిరిజన గ్రామాల్లో గత రెండు రోజులుగా కొండరెడ్లు మామిడికాయ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. వనదేవతలకు పూజలు చేసిన అనంతరం పిల్లలు, పెద్దలు అందరూ కలిసి లయబద్ధంగా డోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకుంటున్నారు.

గిరిజన సంప్రదాయ పండుగలను ప్రభుత్వం గుర్తించాలంటున్న కొండరెడ్లు

తమ పూర్వీకుల నుంచి సంప్రదాయ బద్ధంగా వస్తున్న మామిడికాయ, బాట పండుగ, పప్పుల పండుగలను ప్రభుత్వం గుర్తించాలని కొండరెడ్డి గిరిజనులు కోరుతున్నారు. ప్రతి ఏడాది వేసవి కాలంలో తాము జరుపుకునే పండుగకు సుమారు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ ఖర్చవుతుందని చెప్పారు. ప్రస్తుతం గ్రామస్తులందరూ చందాలుగా వేసుకోవడంతోపాటు కొంతసొమ్ము ప్రజల నుంచి వసూలు చేసి వాటితో పండుగ జరుపుకుంటున్నామని కొండరెడ్డి గిరిజనులు చెబుతున్నారు. ప్రభుత్వం తమ పంటలను గుర్తించి ఐటీడీఏ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.

గిరిజన పండుగలను ప్రభుత్వం గుర్తించాలి



గిరిజన సంప్రదాయ పండుగలైన బాట పండుగ, మామిడికాయ, చిక్కుడు, పప్పుల పండుగలను ప్రభుత్వం గుర్తించి ఐటీడీఏ ద్వారా ఘనంగా జరిపించే విధంగా ఏర్పాటు చేయాలి. మా పూర్వీకుల నుంచి వస్తున్న పండుగలను నేటికీ మేము ఆచరిస్తున్నాం.

– కొక్కెర భీమరాజు, అలివేరు, బుట్టాయగూడెం మండలం

పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం



మా పూర్వీకుల నుంచి ఆచారంగా వస్తున్న మామిడికాయ పండుగను సంప్రదాయంగా నిర్వహిస్తూ వస్తున్నాం. మామిడి చెట్టుకు పూజలు చేసిన తర్వాతే ఆ ఫలాలను తింటాం. అప్పటి వరకూ ఎవ్వరూ ముట్టుకోం. ఎవరు ముట్టుకున్నా వారికి జరిమానా విధించడం జరుగుతుంది.

– సర్ల బుల్లెమ్మ, అలివేరు, బుట్టాయగూడెం మండలం

ఈ శ్రమ్ పోర్టల్‌పై వర్కర్లకు అవగాహన



గిగ్, ప్లాట్‌ఫారం వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ అధికారులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని గిగ్ వర్కర్లు, ప్లాట్ ఫారం వర్కర్లు తప్పనిసరిగా ఈ–శ్రమ్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్ఆర్ పేటలోని ఓ హోటల్‌లో గిగ్ వర్కర్లు, ప్లాట్ ఫారం వర్కర్లు, హోటల్ యాజమాన్యానికి ఈ–శ్రమ్ పోర్టల్ గురించి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల నందు సుమారు 800 మంది వరకు గిగ్, ప్లాట్ ఫారం వర్కర్లు జొమాటో, స్విగ్గీ, ఓలా, ఉబర్, రాపిడ్ వంటి వాటిలో పనిచేసేవారు ఉన్నారన్నారు. వీరందరినీ ఈ–శ్రమ్ పోర్టల్ నందు నమోదు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. వర్కర్లు ఆధార్ నంబర్, పాన్ నంబర్, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నెంబర్ కలిగి ఉండాలన్నారు. కార్మికుల వయసు 16 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఈ నమోదు ప్రక్రియ సెల్ఫ్ రిజిస్ట్రేషన్, సీఎస్‌సీ సెంటర్‌లు, గ్రామ, వార్డు సచివాలయాల్లో చేసుకోవచ్చునని ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ తెలియజేశారు.

● బొప్పాయి.. బడాయి



ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం అలివేరులో నడపల శ్రీరాములు ఇంటి ఆవరణలో ఉన్న ఈ బొప్పాయి చెట్టు ఎన్నో విశేషాలతో ముడిపడి ఉంది. సాధారణంగా బొప్పాయి చెట్టు నిటారుగా పెరిగి ఫలాలను అందిస్తుండగా ఈ బొప్పాయి చెట్టు మాత్రం తన దిశను మార్చుకుని 14 కొమ్మలతో విభిన్నంగా ఉండటం గమనార్హం. ఈ కొమ్మలకు మొత్తం 16 కాయలు ఉన్నాయి. మరో విశేషమేమిటంటే కొన్ని కొమ్మలకు కాయలు ఉన్నా.. ఆకులు కూడా లేకపోవడం గమనార్హం. ఈ బొప్పాయి చెట్టును స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– బుట్టాయగూడెం

నూజివీడు చిన్న రసాలకు పేటెంట్ హక్కు కల్పించాలి

నూజివీడు: దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సాధించిన నూజివీడు చిన్న రసానికి పేటెంట్ హక్కు కల్పించాలని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి హరినాథ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెద్ద పెద్ద నగరాల్లో వేరే ప్రాంతాలకు చెందిన మామిడి కాయలను సైతం నూజివీడు మామిడి రసాలని బోర్డులు పెట్టి విక్రయిస్తున్నారన్నారు. దీనిని బట్టే నూజివీడు మామిడి గొప్పతనం ఏమిటో తెలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మామిడి పంటపై అంతగా ఆసక్తి కనబరుస్తున్నట్లుగా లేదని వెంటనే పంటల బీమా పథకంలో మామిడి పంటను చేర్చాలన్నారు. రాష్ట్రంలో 10.75 లక్షల ఎకరాల్లో మామిడి పంట సాగవుతోందని మామిడి ఎగుమతిలో ఉత్తరప్రదేశ్ ప్రథమ స్థానంలోనూ, ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలోనూ ఉన్నాయన్నారు. అయితే మామిడి అనుబంధ పరిశ్రమలు లేకపోవడంతో మామిడికి మద్దతు ధర లభించడం లేదని, దీంతో మామిడి సాగు రైతులకు నష్టాలను మిగుల్చుతోందన్నారు. నూజివీడు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రభుత్వమే మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి మామిడి రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే నూజివీడులోని మామిడి పరిశోధన స్థానానికి 50 ఎకరాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మామిడి సీజన్లో ఉపాధి హామీ పథకాన్ని మామిడి పంటకు అనుసంధానం చేయాలని కోరారు. నూజివీడు నుంచి మచిలీపట్నం తరలించిన ఏడీ ఆఫీసు తిరిగి నూజివీడులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వివాహితను మోసం చేసిన నేరంపై వ్యక్తి అరెస్ట్

ముదినేపల్లి రూరల్: పెళ్లి చేసుకుంటానని వివాహితను నమ్మించి మోసం చేసిన వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. కొరగుంటపాలెంకు చెందిన వివాహిత భర్తకు దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో కలిదిండి మండలం పోతుమర్రు గ్రామానికి చెందిన దండుబోయిన రామాంజనేయులుతో పరిచయం ఏర్పడింది. రామాంజనేయులు పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహితను శారీరకంగా అనుభవించాడు. అనంతరం ముఖం చాటేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ శ్రావణకుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపి రామాంజనేయులును అరెస్టు చేశారు. కైకలూరు కోర్టులో నిందితుడిని హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఓ ఇంట్లో జరిగిన చోరీపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ జె.మోషే తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసపురానికి చెందిన అప్పన మణి ఈ నెల 30వ తేదీ రాత్రి తన మెడలో ఉన్న 4 కాసుల బంగారు పుస్తెలు కలిగిన బొందు తీసి ఇంట్లో ఓ చోట పెట్టింది. 31వ తేదీ ఉదయం 6 గంటలకు మణి లేచి చూసే సరికి పుస్తెల బొందు కనిపించలేదు. అలాగే ఇంట్లోని బీరువా తలుపులు తెరిచి దుస్తులు చెల్లాచెదురుగా పడేసి ఉన్నాయని, బీరువాలో ఉంచిన రూ.65 వేలు లేకపోవడాన్ని గుర్తించి కుమారుడు రామాంజనేయులకు తెలిపింది. మంగళవారం రామాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రెయిలింగ్‌ను ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి

దేవరపల్లి: వేగంగా వెళుతున్న పల్సర్ బైక్ అదుపుతప్పి గ్రీన్ ఫీల్డ్ హైవేపై గల రెయిలింగ్‌ను ఢీ కొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన దేవరపల్లి మండలం యాదవోలు వద్ద మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంకు చెందిన బోడ పవన్ కుమార్ (25) పల్సర్ బైక్‌పై వెళుతుండగా యాదవోలు గ్రామ సమీపంలో అదుపు తప్పి గ్రీన్ ఫీల్డ్ హైవేపై భద్రత నిమిత్తం ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన పవన్‌కుమార్ బైక్ ఆపకుండా కొంతదూరం వెళ్లి అక్కడ ఆగి ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందినట్టు దేవరపల్లి ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

బంధువునని నమ్మించి దోపిడీ

● రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాల అపహరణ
● పోలీసులకు చిక్కిన నిందితుడు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: దూరపు బంధువునని నమ్మించాడు. అదును చూసి దాడి చేసి బంగారు ఆభరణాలు దోచుకెళ్లాడు. ఆనక పోలీసులకు చిక్కి జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్పీ అద్నాన్ నయీం అస్మి భీమవరం వన్‌టౌన్‌పోలీసు స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన 23 ఏళ్ల పి విక్టర్‌పాల్ తాపీ పనిచేస్తుంటాడు. కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే ఆశతో మార్చి 28వ తేదీన పట్టణంలోని బేతనిపేట అమ్మిరాజుతోటలోని యర్రంశెట్టి మంగతాయారు ఇంటికి వెళ్లి తాను వారికి దూరపుబంధువునని నమ్మించాడు. ఇళ్లు అద్దెకు కావాలని ఇళ్లు చూడడానికి ఇంకా తనవాళ్లు వస్తున్నారంటూ వృద్ధులతో కబుర్లుచెప్పసాగాడు. మూడు గంటల సమయం గడిచిపోవడంతో మంగతాయారు భర్త వీరాస్వామినాయుడు బయటకు వెళ్లడంతో విక్టర్‌పాల్ ఒక్కసారిగా మంగతాయారుపై చాకుతో దాడిచేసి ఆమె మెడలోని సుమారు రూ.5 లక్షల విలువైన 64 గ్రాముల బంగారు గొలుసు, మంగళ సూత్రాలు, నల్లపూసలతాడు అపహరించుకుపోయాడు. గాయాలైన మంగతాయారును ఆసుపత్రిలో చికిత్సకోసం చేర్పించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, సీఐ ఎం.నాగరాజు, సీసీఎస్ సీఐ డి రాంబాబు, ఎస్సైలు బీవై కిరణ్‌కుమార్, ఎం రవివర్మ సిబ్బందితో ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నిందితుడు విక్టర్‌పాల్‌ను సోమవారం పట్టణంలోని బ్రిడ్జిపేట వంతెన వద్ద అరెస్టు చేసినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి చెప్పారు. త్వరితగతిన కేసును ఛేదించడంలో కృషిచేసిన అధికారులను అభినందించి, సిబ్బందికి రివార్డులను అందించారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



ఎస్‌కే నౌషాద్ మొహిద్దీన్

తాడేపల్లిగూడెం (టీటీసీ): ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్న వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోకుంటే ఉద్యమాలు తప్పవని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే నౌషాద్ మొహిద్దీన్ హెచ్చరించారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తన మిత్ర పక్షాలతో కలిసి కుట్ర చేసి లక్షలాది, కోట్ల రూపాయలు విలువైన వక్ఫ్ భూములను స్థానిక అధికారులకు కట్టబెట్టే విధంగా చూస్తూ, ఓ మతాన్ని నష్టపరిచడం చాలా అన్యాయం అన్నారు. పార్లమెంట్‌లో బిల్లుకు ఎన్‌డీఏ కూటమికి అనుకూలంగా టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం ముస్లింలకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల ముందు ముస్లిం హక్కులను కాపాడుతానని చెప్పి, ఇప్పుడు ముస్లింల విశ్వాసానికి వ్యతిరేకంగా వ్యవహరించడం శోచనీయం అని అన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లును వ్యతిరేకించడం హర్షం వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం ఈ బిల్లును ఉపసంహరించాలని కోరారు.